www.aksharadarbar.com
బుధవారం 11, సెప్టెంబర్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :186 | పేజీలు : 05 | వెల : 05

అధైర్యపడొద్దు..

- వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం ..
- ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటన..
- సచివాలయంలో సీఎస్, ఉన్నతాధికారులతో చర్చలు
- వర్షాల వల్ల జరిగిన అపార నష్టాన్ని వివరించిన అధికారులు

05

గచ్చిబౌలిలో రేవ్ పార్టీ భగ్నం

- గెస్ట్ హౌస్‌లో పార్టీ ఏర్పాటు చేసిన టెకీ
- టెకీలతోపాటు సినీ రంగానికి చెందిన వారు హాజరు
- పోలీసుల అదుపులో 18 మంది యువతీ యువకులు
- 45 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, ఈ సిగరెట్లు, మద్యం సీసాలు స్వాధీనం

02

ఎవర్నీ వదలం..

- చెరువులను ఆక్రమిస్తే చెరసాలే..
- ఆక్రమణలను విడిచిపెట్టి వెళ్లండి
- లేదంటే నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తాం..
- ఎఫ్‌టీఎల్, నాలా, బఫర్ జోన్ రెగ్యులరైజ్ స్కీం లేదు
- ఎస్సైల పాసింగ్ అవుడ్ పరేడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- మరో 35 వేల ఉద్యోగాల భర్తీకి నిర్ణయం తీసుకుందని ప్రకటన

05

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైడ్రా లక్ష్యం గురించి తేల్చి చెప్పారు. చెరువులను ఆక్రమిస్తే.. చేరసాలేనని తేల్చేశారు. ఆక్రమణలను విడిచిపెట్టి వెళ్లండని హెచ్చరించారు. లేదంటే నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తామని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీలేదని, క్రమబద్ధీకరణ ఉండబోదని స్పష్టం చేశారు. చెరువులు, నాలాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చడం తన బాధ్యతని సీఎం రేవంత్ కుండబద్దలు కొట్టారు. ఆక్రమణదారుల్లో ఎంత పెద్ద వారు ఉన్న వదిలేది లేదన్నారు. బుధవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో ఎస్సైల పాసింగ్ అవుడ్ పరేడ్‌కు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువత, నిరుద్యోగ సమస్య, ఉద్యోగ నియామకాలు, డ్రగ్స్ నియంత్రణ, పోలీసింగ్, హైడ్రా, రుణమాఫీ వంటి కీలక అంశాలపై ప్రసంగించారు.

- అక్షరదర్బార్, హైదరాబాద్

అసాంఘిక కార్యకలాపాలకు

అడ్డాగా సమీకృత మార్కెట్

- గంజాయి, మద్యం సేవింపునకు కేరాఫ్ గా మారిన వైనం
- పట్టపగలు మందు కొట్టినా పట్టించుకోని అధికారులు

02

262 నిర్మాణాలు

నేలమట్టం

- జూన్ 27 నుంచి 23 ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు
- అక్రమ నిర్మాణాల కూల్చివేతపై హైడ్రా వివరాలు

05

పీడీఎస్ రైస్ అక్రమ రవాణాలో వ్యాపారుల మధ్య వివాదం

కరెప్షన్ కాంప్రమైజ్!

- దందాకు ఆటంకం కలుగుతున్నందున రంగంలోకి ఓ పోలీసు అధికారి
- తగ్గేదేలే అంటున్న వ్యాపారులను పిలిచి సయోధ్య
- రేషన్ బియ్యం అక్రమ రవాణాకు లైన్ క్లియర్ చేసిన వైనం
- భూపాలపల్లిలో వెలుగులోకి వచ్చిన ఘటన

02

కొందరు పోలీసు అధికారులు అక్రమార్జన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. అందిన కాడికి దండుకునేందుకు అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారు. కాసులు కూడబెట్టడమే కర్తవ్యంగా మాఫీయాలకు దన్నుగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో అసాంఘిక శక్తుల మధ్య వివాదం తలెత్తితే స్వయంగా కలుగజేసుకొని సయోధ్య కుదుర్చుతున్నారు. నవ్విపోదురు గాక నాకేమిటి అనే రీతిలో రాజీ కావటమే ఇల్లీగల్ దందాకు రాచమార్గమని అక్రమ వ్యాపారులకు చెబుతున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రైస్ దందాలో ఇదే జరుగుతుంది. తాజాగా భూపాలపల్లిలో ఓ పోలీసు అధికారి పీడీఎస్ రైస్ దందా చేసే ఇద్దరు వ్యాపారుల మధ్య వివాదం తలెత్తగా రంగంలోకి దిగి సయోధ్య కుదిర్చినట్లు తెలిసింది. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని నెలనెలా ముడుపులు పుచ్చుకుంటున్న పోలీసులు కొందరు వదిలిపెడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో సదరు పోలీసు అధికారి పీడీఎస్ రైస్ అక్రమ రవాణాలో ఆటంకంగా మారుతున్న వ్యాపారులను కాంప్రమైజ్ చేసి దందాకు లైన్ చేయడం క్లియర్ చేయడం స్థానికంగా చర్చనీయమైంది.

–అక్షర దర్బార్, నిఘావిభాగం



అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

కరప్షన్ కాంప్రమైజ్!

- పీడీఎస్ రైస్ అక్రమ రవాణాలో వ్యాపారుల మధ్య వివాదం
- దందాకు ఆటంకం కలుగుతున్నందున రంగంలోకి ఓ పోలీసు అధికారి
- తగ్గేదేలే అంటున్న వ్యాపారులను పిలిచి సయోధ్య
- రేషన్ బియ్యం అక్రమ రవాణాకు లైన్ క్లియర్ చేసిన వైనం
- భూపాలపల్లిలో వెలుగులోకి వచ్చిన ఘటన

అక్షరదర్బార్, నిఘావిభాగం:

కొందరు పోలీసు అధికారులు అక్రమార్జన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. అందిన కాడికి దండుకునేందుకు అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారు. కాసులు కూడబెట్టడమే కర్తవ్యంగా మాఫీయాలకు దన్నుగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో అసాంఘిక శక్తుల మధ్య వివాదం తలెత్తితే స్వయంగా కలుగజేసుకొని సయోధ్య కుదుర్చుతున్నారు. నవ్విపోదురు గాక నాకేమిటి అనే రీతిలో రాజీ పడటమే ఇల్లీగల్ దందాకు రాచమార్గమని చెబుతున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రైస్ దందాలో ఇదే జరుగుతుంది. తాజాగా భూపాలపల్లిలో ఓ పోలీసు అధికారి పీడీఎస్ రైస్ దందా చేసే ఇద్దరు వ్యాపారుల మధ్య వివాదం తలెత్తగా రంగంలోకి దిగి సయోధ్య కుదిర్చినట్లు తెలిసింది. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని నెలనెలా ముడుపులు పుచ్చుకుంటున్న పోలీసులు కొందరు వదిలిపెడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో సదరు పోలీసు అధికారి పీడీఎస్ రైస్ అక్రమ రవాణాలో ఆటంకంగా మారుతున్న వ్యాపారులను కాంప్రమైజ్ చేసి దందాకు లైన్ క్లియర్ చేయడం స్థానికంగా చర్చనీయమైంది.

- వ్యాపారుల మధ్య లొల్లి

కొందరు వ్యాపారులు పీడీఎస్ రైస్ ను గ్రామాల్లో తక్కువ ధరకు సేకరించి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేస్తూ ఎక్కువ ధరకు విక్రయించడం ద్వారా అధిక లాభాలు గడిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేషన్ బియ్యం సేకరణకు ప్రతి మండలంలో ఇద్దరు ముగ్గురు వ్యాపారులు ఆయా గ్రామంలోని ఏజెంట్ల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఈ బియ్యాన్ని వ్యాన్లు, ఇతర వాహనాల ద్వారా ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఈ దందాలో అవగాహన మేరకు ఆయా మండలంలో స్థానిక పోలీసు అధికారులు కొందరు సహకరిస్తున్నారని, రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యాపారం సాఫీగా జరిగేందుకు తోడ్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేసే వారి మధ్య గొడవలు తలెత్తితే వాటిని సదరు పోలీసు అధికారులే కలగజేసుకొని పరిష్కరిస్తున్నట్లు కూడా ఫిర్యాదులున్నాయి. తాజాగా భూపాలపల్లి పట్టణంలో పీడీఎస్ రైస్ అక్రమ వ్యాపారం చేసే వారిలో ఇద్దరి మధ్య ఇటీవల వివాదం తలెత్తినట్లు తెలిసింది. దీంతో రేషన్ బియ్యంతో ఇతర రాష్ట్రాలకు బయలుదేరిన ఒకరి వాహనాల సమాచారాన్ని మరొకరు వివిధ శాఖల అధికారులకు ఇచ్చారు. దీంతో ఇటీవలి కాలంలో వేరువేరు సందర్భాల్లో ఇద్దరికి చెందిన వాహనాలు పట్టుబడటం, ఆ వాహనాల్లో రవాణా అవుతున్న పీడీఎస్ రైస్ నిలువలను అధికారులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ క్రమంలో పట్టుబడిన వాహనాలు సైతం ఇప్పటికీ పోలీసు స్టేషన్ లోనే ఉన్నట్లు సమాచారం.

రంగంలోకి పోలీసు అధికారి

భూపాలపల్లి పట్టణంలోని రేషన్ అక్రమ వ్యాపారుల్లో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడటం, ఒకరి బియ్యం వాహనాన్ని మరొకరు పట్టిస్తుండటం వంటిది అక్రమ దందాలో ఆటంకంగా మారడంతో స్థానిక పోలీసు అధికారి ఒకరు సమస్యగా భావించారు. ఇంకేముంది... పరిష్కారం కోసం రంగంలోకి దిగిన సదరు పోలీసు అధికారి తగ్గేదేలే అనే రీతిలో తలపడుతున్న పట్టణంలోని రేషన్ అక్రమ వ్యాపారులను ఇద్దరిని ఇటీవల పోలీస్ స్టేషన్ కు పిలిచారని సమాచారం. గొడవ పడటం వల్ల జరిగే నష్టాలను తమదైన స్టైల్ లో వివరించి ఇద్దరిని కాంప్రమైజ్ చేసి, రేషన్ బియ్యంతో వెళ్లే ఒకరు వాహనాన్ని మరొకరు పట్టించకుండా సయోధ్య కుదిర్చినట్లు తెలిసింది. ఇదంతా అవగాహన మేరకే జరిగినట్లు సమాచారం. పీడీఎస్ రైస్ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన ఓ పోలీసు అధికారి స్వయంగా రేషన్ బియ్యం అక్రమ రవాణాలో తలెత్తిన ఆటంకాలను తొలగించి లైన్ క్లియర్ చేయటం హాట్ టాపిక్ గా మారింది.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వివరాలు అందించండి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- భారీ వర్షాల వల్ల కలిగిన నష్టం అంచనాలపై అధికారులతో సమీక్ష

అక్షరదర్బార్, హనుమకొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలను వెంటనే సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులతో భారీ వర్షాల వలన కలిగిన నష్టం అంచనాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులను భారీ వర్షాల వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ హనుమకొండ జిల్లాకు రూ.3 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. వర్షాల వల్ల కలిగిన నష్టానికి ప్రభుత్వం కేటాయించిన ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు జరిగిన నష్టం వివరాలు, ఏ ఏ పనులకు ఎన్ని నిధులు అవసరమో తగిన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని కోరారు. హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, డీఈవో వాసంతి, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వెంకట్ నారాయణ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ రాజయ్య, అధికారులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలి

డీఐజీకి సీనియర్ జర్నలిస్టు వేముల సదానందం ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టు సదానందం

అక్షరదర్బార్, హన్మకొండ: స్థిర, చరాస్తులు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొందరు సబ్ రిజిస్ట్రార్లు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని సీనియర్ జర్న లిస్టు వేముల సదానందం కోరారు. ఈమేరకు బుధవారం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీని కలిసి ఫిర్యాదు చేశారు. హన్మకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రాపర్టి అటాచ్ మెంట్ సూట్‌కు సంబంధించిన జిరాక్స్ కాపీలు జతపర్చుతూ లిఖితపూర్వకంగా ఓ స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేయాలని ఫిర్యాదు చేసినట్లు సదానందం తెలిపారు. అందుకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ రాంనరసింహారావు అక్నాలడ్జిమెంట్ కూడా ఇచ్చారన్నారు. కోర్టులో కేసు ఉన్నప్పటికీ సబ్ రిజిస్ట్రార్ పెద్దఎత్తున అవినీతికి పాల్పడి పాత తారీఖుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగించారని వేముల ఆరోపించారు. ఈ విషయంలో పూర్తి విచారణ జరిపించి హన్మకొండ సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రేషన్ స్టాంపులు డిపార్ట్మెంట్ డిఐజీ ఇంచార్జీ డీఆర్ సుభాషినికి పిర్యాదు చేసినట్లు వేముల ఒక ప్రకటనలో తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సమీకృత మార్కెట్

-బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఆకతాయిలు

పట్టించుకోని అధికారులు

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని వెల్లంపల్లి రోడ్డులో సమీకృత మార్కెట్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. మూడేళ్ల కింద రూ.4.50 కోట్లతో మార్కెట్ ఆకతాయిలకు మద్యం సేవించడానికి ఉపయోగపడుతోంది. పోకిరీలు గంజాయి తాగుతున్నట్లు సమాచారం. అలాంటి అసాంఘిక కార్యక్రమాలకు నిలయమైన సమీకృత మార్కెట్ ను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో తాగుబోతులకు ఆడింది ఆట పాడింది పాటగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గచ్చిబౌలిలో రేవ్ పార్టీ భగ్నం..

- గెస్ట్ హౌస్ లో పార్టీ ఏర్పాటు చేసిన టెకీ..
- సినీ రంగానికి చెందిన వారు హాజరు
- పోలీసుల అదుపులో 18 మంది యువతీ యువకులు
- 45 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, ఈ సిగరెట్లు, మద్యం సీసాలు స్వాధీనం

అక్షరదర్బార్, హైదరాబాద్: హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో నిర్వహిస్తున్న రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు. గెస్ట్ హౌస్ లో ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాటు చేసిన పార్టీకి సినీ పరిశ్రమలోని పలువురు వ్యక్తులు హాజరయినట్లు సమాచారం. టీఎన్జీవో కాలనీలోని ఓ గెస్ట్ హౌస్‌లో జరిగిన ఈ పార్టీలో గంజాయి, ఈ సిగరెట్లు తదితర నిషేధిత పదార్థాలను విచ్చలవిడిగా వినియోగించినట్లు తెలుస్తోంది. పక్కా సమాచారంతో దాడిచేసిన మాదాపూర్ ఎస్ వోటీ పోలీసులు.. మొత్తం 18 మంది యువతీయువకులను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఆరుగురు యువతులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వారి నుంచి 45 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, ఈ సిగరెట్లు, మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఆపై వారిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు వివరించారు.

వరద బాధితులకు అండగా బీఆర్ఎస్..

- ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- అధైర్య పడకండి అండగా ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్

అక్షర దర్బార్,కేసముద్రం: వరద బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ శాసన సభ్యులు బానోత్ శంకర్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వరద బాధితుల కోసం పంపిన నిత్యావసర సరుకులను శంకర్ నాయక్ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ.. వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హడావుడిగా వచ్చి అనేక వాగ్దానాలు చేసి వెళ్లారని, రూ.10 వేల నష్టపరిహారం వారమైనా అందలేదని దుయ్యబట్టారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కెంచ రాజమణి, కల్పగురి రవి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనాథ్ రెడ్డి, నీలం దుర్గేష్, మహమ్మద్ నజీర్, కమటం శ్రీను, రవిందర్ రెడ్డి, వీరు నాయక్, షేక్ జాని, గంధసిరి సోమన్న, మోడం రాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న శంకర్ నాయక్

బీమా పాలసీతో కుటుంబానికి రక్షణ...

అక్షర దర్బార్, పరకాల : బీమా పాలసీలతో కుటుంబానికి రక్షణ ఉంటుందని పరకాల బ్రాంచ్ చీఫ్ మేనేజర్ విశ్వనాథన్ అన్నారు. శాయంపేట మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి ఏజెంట్ల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. పాలసీదారులకు అనుకూలంగా ఉన్న పాలసీలను ఏజెంట్లు తెలియజేసి విక్రయించాలని సూచించారు. ఎల్ఐసీలో గణనీయ మార్పులు చోటు చేసుకుంటున్నాయని, పేపర్ లెస్ వర్క్ లో భాగంగా ఆనంద పోర్టల్ లో పాలసీలు చేయాలని, కాలానికి అనుగుణంగా ఏజెంట్లు మార్పులు చెందాలని సూచించారు. ప్రతి ఒక్కరికి బీమా పాలసీ అందజేసి కుటుంబాలకు రక్షణ కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అరుణ్ మిత్ర, డెవలప్మెంట్ ఆఫీసర్ మల్లికార్జున్, ఏజెంట్లు బాల్నే తిలక్ బాబు, దూదిపాల బుచ్చిరెడ్డి, వేముల కుమారస్వామి, అయిలి శ్రీనివాస్, అక్కపల్లి రాజు, దుబాసి రవి, బలభద్ర హైమావతి, గట్టు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరకాల బ్రాంచ్ చీఫ్ మేనేజర్ విశ్వనాథన్

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

అక్షరదర్బార్, నర్సంపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం బాలాజీ టెక్నో స్కూల్ ఆవరణలో వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జెఎన్ఎస్ లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని విజయం సాధించిన బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విజేతలు బి.గౌతమ్, బి. సిద్దు, బి.హర్షవర్ధన్ ను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి. రవీందర్ రెడ్డి, భవాని చంద్, వినోద్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులను ఆపాలి

ఎన్నారై ఫోరం యూకే అధికార ప్రతినిధి శానబోయిన రాజ్ కుమార్

అక్షర దర్బార్, నర్సంపేట : గ్రామాల్లో పేద ప్రజలకు అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై వైద్యాధికారులు చేస్తున్న దాడులను ఆపాలని ఎన్నారై ఫోరం యూకే అధికార ప్రతినిధి, యూత్ ఫర్ స్వచ్ఛ్ దుగ్గొండి వ్యవస్థాపక అధ్యక్షులు శానబోయిన రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికీ ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్య వచ్చినా ప్రథమ చికిత్స అందిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందిస్తున్న అర్హులైన ఆర్ఎంపీ, పీఎంపీలను గుర్తుంచి వారికి తగిన శిక్షణ ఇచ్చి ప్రభుత్వపరంగా సర్టిఫై చేసి ప్రజలకు సేవ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మాలోతు లింగు నాయక్ ఔదార్యం

అక్షర దర్బార్, పరకాల : ఆపదలో ఉన్న ప్రజల కోసం తన వంతుగా సహాయం చేసి కన్న ఊరి రుణం తీర్చుకోవాలని ముందు వరుసలో ఉన్న వ్యక్తి మాలోతు లింగ నాయక్. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరుపుల బాలు ఇల్లు కూలిపోవడంతో చలించిపోయిన మాలోతు లింగునాయక్ తనవంతు సాయంగా రూ. 5వేలు ఆర్థిక సహాయం అందించి తన ఔదార్యాన్ని చాటారు. కార్యక్రమంలో మాలోతు భాష, బలరాజ్, మాలోత్ చరణ్. శోభన్ గణేష్, రాజు, సరోజన, రాకేష్, సునీల్, అనిల్, జీవన్, రాజు, జగన్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న లింగు నాయక్

సమావేశానికి సింగరేణి జీఎం రాకపోతే ఎలా?

- గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- మున్సిపల్ కమిషనర్ పై ఆగ్రహం..

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్,భూపాలపల్లి: జిల్లా కలెక్టర్, శాసనసభ్యుడు చెప్పినా పనులు చేయకపోతే మున్సిపల్ కమిషనర్ ఎందుకు ఉన్నట్లు అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మున్సిపల్ కమిషనర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సిగ్గెం వెంకటరాణి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ రాహుల్ శర్మ, శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. సీఎస్ఆర్ నిధులు ఈ ప్రాంత అభివృద్ధికి వినియోగించాలని, కార్మికుల నివాస గృహాలకు నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని, సింగరేణి సంస్థ గనులు ఏర్పాటులో ప్రజాభిప్రాయ సేకరణలో ఆ ప్రాంత అభివృద్ధి బాధ్యత మేము తీసుకుంటామని చెప్పారని, ఇప్పుడు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. జీఎం సమావేశానికి ఎందుకు రాలేదని, వాళ్లు రాని సమావేశం నిర్వహించడం దండగేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మీకు లేదా అంటూ కమిషనర్ ను ప్రశ్నించారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

భూపాలపల్లి మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం కుందూరుపల్లి, భాస్కరగడ్డలో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణవాసుల దాహార్తి తీర్చేందుకు ఇటీవల అమృత్ పథకం 2.0 ద్వారా రూ.18.99 కోట్లతో ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకుల నిర్మాణం ఇదివరకే చేపట్టినట్లు తెలిపారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆదర్శవాణి విద్యార్థుల ఎంపిక

అక్షర దర్బార్, దుగ్గొండి: ఈనెల 10వ తేదీన జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఆదర్శవాణి హై స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల చైర్మన్ నాగనబోయిన రవి తెలిపారు. వివిధ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఏ.సాయి తేజ, పి.శివ, పి.సుసన్న, టీ.భాను ప్రసాద్, సాయి చరణ్ ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ భిక్షపతి, ప్రిన్సిపాల్ మణికంఠ రవి, పీఈటీలు అంజాద్ పాషా, మహేందర్, సందీప్, పాల్గొన్నారు.

గెలుపొందిన పతకాలతో విద్యార్థులు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రైతాంగ పోరాటాన్ని అధికారంగా నిర్వహించాలి

అక్షర దర్బార్,కేసముద్రం: సెప్టెంబర్ 17న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించాలని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్,మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం,వెట్టిచాకిరి చాకిరి విముక్తి కోసం నాడు తెలంగాణ రైతంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. నైజాం సర్కార్ అండదండలతో గ్రామాలలో దొరలు, భూస్వాములు ప్రజలను చిత్రహింసలకు గురిచేసి అరాచక పాలన కొనసాగించారన్నారు. దొడ్డి కొమురయ్య అమరత్వంతో ఎర్రబారిన తెలంగాణలో రావి నారాయణరెడ్డి, మగ్దుం మోహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది అమరత్వం పొంది పేద ప్రజలకు భూస్వాముల దగ్గర నుంచి 10 లక్షల ఎకరాల భూమిని పంచి 3వేల గ్రామాలను విముక్తి చేసిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మడత నారాయణ,దాసరి యాకయ్య పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న రంజిత్ రెడ్డి, నాయకులు

మృతుడి కుటుంబానికి రంజిత్ రెడ్డి పరామర్శ..

అక్షర దర్బార్, నెక్కొండ : మండలంలోని సాయిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బండారుపల్లి శ్రీనివాసరావు, చెంచారావు తండ్రి బ్రహ్మయ్య అనారోగ్యంతో మృతి చెందగా పీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బక్కి అశోక్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, కెవి సుబ్బారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు దొడ్డ విజయ్, తాళ్లూరి నరసింహ స్వామి, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడియా తిరుమల్, చల్ల పాపిరెడ్డి, సాయిరెడ్డిపల్లి గ్రామ అధ్యక్షులు బిచ్చ నాయక్, రవి, సురేష్ కుమార్, లావుడియా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డలో అధికారుల పర్యటన

అక్షర దర్బార్, మహాదేవపూర్: మేడిగడ్డ ప్రాజెక్టును బుధవారం సిడబ్ల్యూ పీఆర్ఎస్ పుణె బృందం పరిశీలించింది. ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహాన్ని ఏడీసీపీ పరికరంతో నీటి ప్రవాహాన్ని అధ్యయనం చేశారు. అధికారులు సోనార్ సాంకేతికను ఉపయోగించి నీటి ప్రవాహంతో పాటు తరంగాలను నీటి అడుగున ఉన్న పరిస్థితులను ఈ పరికరం ద్వారా పరిశీలించారు. వారి వెంట నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

మేడిగడ్డ ప్రాజెక్టులో పర్యటిస్తున్న అధికారులు

గణపయ్యకు ఘనమైన పూజలు

పూజలు చేస్తున్న సుస్మిత- సురేష్ దంపతులు

అక్షర దర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రం లోని హమాలీ వీధిలో గణపయ్యకు ఘనమైన పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా హమాలి వాడకు చెందిన మంతెన సుస్మిత సురేష్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.మాడుగుల నాగరాజు శర్మ పర్యవేక్షణ లో నిమజ్జన కార్యమాన్ని నిర్వహించారు. గణేష్ విగ్రహ కమిటీ సభ్యులు రాజమణి , కడారి గౌరమ్మ , వెంకటమ్మ , మెరుగు సునీత , వేమునూరి సౌజన్య, రామిళ్ళ తిరుతమ్మ , కడారి

పూజల్లో పాల్గొన్న యంగ్ స్టార్ యూత్ సభ్యులు

ధనుష్ , కిరణ్ , బొల్లి సుదర్శన్, పాల్గొన్నారు

ఉప్పరపల్లిలో..

అక్షర దర్బార్,కేసముద్రం: ఉప్పరపల్లి గ్రామంలో యంగ్ స్టార్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద యూత్ సభ్యులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులను చల్లగా చూడాలని బొజ్జ గణపయ్యను వేడుకున్నారు. కార్యక్రమంలో అఖిల్, రవి, సురేందర్, రాకేష్, సందీప్, వెంకటేష్, కిరణ్ పాల్గొన్నారు.

కాకతీయ కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు

కాకతీయకాలనీలో..

అక్షర దర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు కాకతీయ కాలనీలో గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణనాథుడి కరుణా కటాక్షాలు ప్రతీ ఒక్కరిపై ఉండాలని వారు కోరుకున్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షర దర్బార్,భూపాలపల్లి: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపట్టినందున నూతన ఓటరు నమోదు, చిరునామా మార్పు, పోలింగ్ కేంద్రం మార్పునకు అవకాశం కల్పించినట్లు వివరించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న మెపా నాయకులు

బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

నర్సంపేట, అక్షర దర్బార్: మండలంలోని సర్వాపురం గ్రామానికి చెందిన జెట్టి మొగిలి ముదిరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి మెపా (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులు 50 కేజీల బియ్యం మృతుడి భార్య అనూష కు అందించారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు దండు చిరంజీవి ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ముదిరాజ్,నర్సంపేట డివిజన్ అధ్యక్షులు పెండ్యాల యాదగిరి ముదిరాజ్, నాయకులు దోని చేరాలు, సింగారపు రామకృష్ణ ముదిరాజ్, నీరటి రాజు ముదిరాజ్, సందీప్ ముదిరాజ్, సతీష్ ముదిరాజ్ పాల్గొన్నారు..

నూతన రెవెన్యూ చట్టం రైతులకు ఉపయోగపడాలి

అక్షర దర్బార్, పరకాల : ఎన్నో ఏండ్లుగా రైతులకు తమ భూములపై హక్కులు లేక ఇబ్బంది పడుతున్నారని, అలాంటి వారికి నూతన రెవెన్యూ చట్టం ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు జిల్లా రెవెన్యూ అధికారి గణేష్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సేద్యం చేస్తున్న భూములపై ఇబ్బందులు లేకుండా చూడాలని ధరణి పోర్టల్ ను సవరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న కిషన్ రావు

పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

బీజేపీ ఆత్మకూర్ మండల శాఖ డిమాండ్

అక్షర దర్బార్, పరకాల : కటాక్షపూర్ పెద్ద చెరువు శిఖం భూముల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఆత్మకూర్ మండల అధ్యక్షుడు బలవంతుల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కు పిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఇరసడ్ల సదానందం, ఆర్టీఐ యాక్ట్ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి బయ్య పైడి కళ్యాణ్, బూత్ అధ్యక్షులు పీసాల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా గాలీఫ్

అక్షర దర్బార్, రేగొండ : బీజేవైఎం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షునిగా రేగొండ మండలం రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎండీ గాలిఫ్ నియమితులైనట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడు నూతుల నిశిధర్ రెడ్డి తెలిపారు. గాలిఫ్ విద్యార్థి దశ నుండే విద్యార్థుల సమస్యపై అనేక పోరాటాలు చేసి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడని కొనియాడారు. గాలిఫ్ మాట్లాడుతూ తనకు అధ్యక్ష పదవి రావడానికి సహకరించిన జిల్లా నాయకులకు, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డికి రుణపడి ఉంటానని, నియోజకవర్గంలో కాషాయ జెండా జయకేతనం కోసం కృషి చేస్తానని తెలిపారు.

- చెరువులను ఆక్రమిస్తే చెరసాలే..
- ఆక్రమణలను విడిచిపెట్టి వెళ్ళండి
- లేదంటే నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తాం..
- ఎఫ్టీఎల్, నాలా, బఫర్ జోన్ రెగ్యులరైజ్ స్కీం లేదు
- ఎస్సైల పాసింగ్ అవుడ్ పరేడ్‌లో
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- మరో 35 వేల ఉద్యోగాల భర్తీకి నిర్ణయం తీసుకుందని ప్రకటన

ఎవరినీ వదలం..!

అక్షరదర్బార్, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైడ్రా లక్ష్యం గురించి తేల్చి చెప్పారు. చెరువులను ఆక్రమిస్తే.. చేరసాలే నని తేల్చేశారు. ఆక్రమణలను విడిచిపెట్టి వెళ్ళండని హెచ్చరించారు. లేదంటే నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తామని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీలేదని, క్రమబద్దీకరణ ఉండబోదని స్పష్టం చేశారు. చెరువులు, నాలాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చడం తన బాధ్యతని సీఎం రేవంత్ కుండబద్దలు కొట్టారు. ఆక్రమణదారుల్లో ఎంత పెద్ద వారు ఉన్న వదిలేది లేదన్నారు. ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో ఇళ్లు కట్టుకున్నవారు వెంటనే వాటిని విడిచిపెట్టాలని సీఎం రేవంత్ సూచించారు. అక్రమ నిర్మాణాలు ఎప్పటికైనా నేలమట్టం కాకతప్పదన్నారు. హైదరాబాద్ నీటి కాలుష్యమంతా నల్గొండను ముంచెత్తుతోందని, అందుకే మూసీ నది ప్రక్షాళనను చేపట్టామని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో సైనిక స్కూల్ తరహాలో పోలీసులకు 50 ఎకరాల్లో పోలీసు రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు రేవంత్ వెల్లడించారు. బుధవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో ఎస్సైల పాసింగ్ అవుడ్ పరేడ్‌కు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువత, నిరుద్యోగ సమస్య, ఉద్యోగ నియామకాలు, డ్రగ్స్ నియంత్రణ, పోలీసింగ్, హైడ్రా, రుణమాఫీ వంటి కీలక అంశాలపై ప్రసంగించారు.

50 ఎకరాల్లో రెసిడెన్షియల్స్..

వరదల కారణంగా పేదల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. ఆక్రమణల కారణంగానే వరదలు వస్తున్నాయి. ఆక్రమణలను తొలగించి మూసీ నది ప్రక్షాళన చేస్తాం. పరీవాహక ప్రాంతంలోని 11 వేలకు పైగా నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుంది. మనకు కాస్మెటిక్ పోలీసింగ్ కాదు. కాంక్రీట్ పోలీసింగ్ అవసరం. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులకు మాత్రమే, నేరస్తులకు కాదు. ఖాకీ డ్రెస్ ఉన్నది ప్రజల కోసమే అనే విశ్వాసం కల్పించేలా కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ఎస్సైలు, ఏఎస్ఐలు పని చేయాలి. పోలీసుల పిల్లల కోసం హైదరాబాద్, వరంగల్‌లో ఒక్కోచోట 50 ఎకరాల్లో రెసిడెన్షియల్స్ ను రెండేళ్లలో అందుబాటులోకి తెస్తాం.. అని రేవంత్ అన్నారు. మా ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి కోసం పెట్టుబడులు తీసుకురావడమే కాదు, రైతన్నలు, నేతన్నలు, గీతన్నలను ఆదుకుంటోంది. కేవలం 28 రోజుల్లోనే 22,22,685 రైతుల ఖాతాల్లో రూ. 18 వేల కోట్లు జమచేసి రుణమాఫీ చేశామని తెలిపారు. తొమ్మిదేండ్లుగా నెరవేరని నిరుద్యోగ యువత ఆకాంక్షలను మా ప్రభుత్వం సాకారం చేస్తోంది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టాం. ఇప్పుడు యువకులు ఉత్సాహంతో పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు.

547 సబ్ ఇన్ స్పెక్టర్లు పాసింగ్ అవుట్ ..

తెలంగాణ పోలీస్ అకాడమీ నుండి 547 సబ్ ఇన్స్‌పెక్టర్లు పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారిలో 145 మంది మహిళా ఎస్ఐలు, 402 మంది పురుషులు ఉన్నారు. 547 లో 401 మంది సివిల్ ఎస్ఐలు ఉన్నారు. అలాగే 547లో 472 మంది గ్రాడ్యూట్స్, 75 మంది పోస్ట్ గ్రాడ్యూఎట్స్ ఉన్నారు. వీరిలో 248 మంది ఎస్ఐలకు బీ టెక్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. పరేడ్ కమాండర్‌గా మహిళా ఎస్ఐ పల్లి బాగ్యశ్రీ వ్యవహరించారు. ట్రైనింగ్ పూర్తిచేసుకున్న వారిలో అత్యధికంగా 26 నుంచి ముప్పై వయసు గల అభ్యర్థులు ఉన్నారు. 283 మంది 26 నుంచి 30 సంవత్సరాల వయసు కలవారు శిక్షణ పొందారు. అలాగే 182 మంది 25 ఏళ్ళ లోపు వయసున్నవారు సబ్ ఇన్స్‌పెక్టర్లుగా శిక్షణ పొందారు.

వరద బాధితులకుపోలీసుల భారీ విరాళం

- రూ. 11 కోట్ల చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందజేసిన పోలీస్ అధికారుల సంఘం

వరద బాధితుల సహాయార్థం పోలీసుశాఖ ఒక్క రోజు వేతనం 11,06,83,571 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందజేశారు. పోలీస్ అకాడమీలో జరిగిన ఎస్ ఐలు, ఏఎస్ ఐల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో ఈ మొత్తానికి సంబంధించి చెక్కును హోంసెక్రెటరీ రవి గుప్తా, డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందించారు. వరద బాధితులను ఆదుకోవడానికి మంచి ఆశయంతో

ముందుకొచ్చి సహాయాన్ని అందించిన పోలీసుశాఖకు ఈ సందర్భంగా సీఎం అభినందనలు తెలియజేశారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

అక్షరదర్బార్,తొర్రూరు: పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గం పరిధిలోని తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 54 మంది అనారోగ్యానికి గురైన బాధితులకు మంజూరైన రూ.17,21,000 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేదలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్యశ్రీ పథకం వర్తించని వ్యాధులకు పేదలను ఆదుకోవడం కోసం సీఎం రేవంత్ రెడ్డి లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

262 నిర్మాణాలు నేలమట్టం

- 23 ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు
- అక్రమ నిర్మాణాల కూల్చివేతపై హైడ్రా వివరాలు

అక్షరదర్బార్, హైదరాబాద్ : అక్రమ నిర్మాణాల కూల్చివేతపై హైడ్రా వివరాలు వెల్లడించింది. మొత్తం 111.72 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు ప్రకటించింది. గాజుల రామారం చింతల చెరువు బఫర్ జోన్‌లో 54 నిర్మాణాలు కూల్చివేసినట్లు తెలిపింది. రాజేంద్రనగర్ 45, మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో 42 నిర్మాణాలు తొలగించామని స్పష్టంచేసింది. జూన్ 27 నుంచి నేటి వరకు మొత్తం హైదరబాద్ పరిధిలోని 23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్లు హైడ్రా పేర్కొంది. అక్రమ నిర్మాణాల కూల్చివేతపై హైడ్రా వివరాలు వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసింది.

టాస్క్ ఫోర్స్ దాడిలో పీడీఎస్ బియ్యం పట్టివేత

అక్షర దర్బార్, వరంగల్ : పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరిలిస్తుండగా టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. జనగామ పట్టణం తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి మార్కెట్ ప్రాంతంలో గల స్వంత ఇంటిలో నిల్వఉంచారు. ఈ మేరకు రంగంలోకి దిగిన జనగామ పోలీసులు సోదాలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 74 బస్తాల 93 వేల విలువ గల 36 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసుకొని నిందితుడు రోకళ్ల నాగులును అదుపులోకి తీసుకున్నారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌స్పెక్టర్ ఎస్ రవికుమార్, ఆర్.ఎస్.ఐ శరత్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, జనగామ పోలీసులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు..

- వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం ..
- ఖమ్మం, మానుకోట జిల్లాల్లో పర్యటన..
- సచివాలయంలో అధికారులతో చర్చలు
- వరద నష్టాన్ని వివరించిన అధికారులు

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా సంభవించిన అపారమైన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం రాష్ట్ర పర్యటనకు వచ్చింది. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సంభవించిన నష్టాలను అంచనా వేసింది. వరద ప్రభావిత ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటించి వరదల్లో చిక్కుకున్న బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు కల్నల్ కెపి సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కేంద్ర బృందం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులతో చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కేంద్ర బృందానికి నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవడం వలన ప్రాణనష్టం తగ్గించగలిగామని సిఎస్ తెలియజేశారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు క్రమం తప్పకుండా పరిస్థితిని సమీక్షించి, వరద, పునరావాస, సహాయక చర్యలను పర్యవేక్షించారని సీఎస్ కేంద్ర బృందానికి తెలియజేశారు. సహాయక చర్యలు చేపట్టేందుకు ఉపముఖ్యమంత్రితో పాటు మరో ఇద్దరు రాష్ట్ర మంత్రులు హుటాహుటిన ఖమ్మం చేరుకొని సహాయక కార్యక్రమాలను వేగవంతం చేశారని, ఆయా జిల్లాల్లో అధికార యంత్రాంగానికి వరద సహాయం, పునరావాస కార్యక్రమాలకు సంబంధించి నిధులు వెంటనే విడుదల చేశామని తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. ఆయా జిల్లాల్లో వర్షాల వల్ల జరిగిన అపార నష్టాన్ని ఈ ప్రదర్శనలో వివరించారు. వరద ప్రభావిత ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో కేంద్ర బృందాలు పర్యటించాయి.